క థ

# మానసిక సమస్యలా?



'సుబ్బారావు' అనగానే మనకి ఒక అమాయకుడు, ఓ వెర్రిబాగులవాడు అనిపించేస్తుంది. మన సుబ్బారావు కూడా అలాంటివాడే. సుబ్బారావు అని పేరెందుకు పెట్టారోగాని ఆ పేరు కూడా సుబ్బారావుకి పెనుభారంగా పరిణమించింది.

సుబ్బారావు తండ్రి రాజారావు ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. రాజారావు గొప్ప నటుడు. ఆయనకు బ్రతుకే నాటకం. నాటకం లేకుండా ఆయన ఉండలేడు. తను వేరు నటనవేరు కాదని ఆయన నిశ్చితాభిప్రాయం. ప్రతిరోజూ ప్రొద్దున్నే కారేజ్‌తో ఇంట్లోంచి బయల్దేరి, స్కూలు అయ్యాక రిహార్సిల్స్ చూస్కుని రాత్రి పదకొండు, పన్నెండు గంటలకు ఇల్లు చేరుకుంటాడు. సెలవొస్తే, ప్రోగ్రాం ఏదీ లేకపోతే ఇంట్లోనే ఉంటాడు. ఇంట్లో ఉన్నంతసేపు నాటకాలు చదవటం, డైలాగులు ప్రాక్టీసు చేయడంలో మునిగి తేల్తుంటాడు. నెలలో రెండు మూడుసార్లు ఎక్కడో ఒకచోట నాటకం వెయ్యాల్సివస్తుంటుంది. కాబట్టి నెలలో పదిరోజులు ఆయన ఊళ్లు పట్టుకుని తిరిగుతుంటాడు.

రాజారావుకు ఇంట్లో ఉన్నప్పుడే తనకి ముగ్గురు పిల్లలు ఉన్నారనికాని, వాళ్లు చదువుకుంటున్నారనికాని పట్టదు. ఇంక బయటకు పోతే ఇంటి ఆలోచనే ఉండదు. తండ్రి వరస ఇలా అయితే ఇక తల్లి అనసూయ విషయం. ఆవిడకు బయట ప్రపంచంతో పనిలేదు. ఇల్లు, ఇంట్లో మనుషులు, వస్తువులు ఇది ఆవిడ ప్రపంచం. ఇంటిని నియంత్రించడం ఆవిడ లక్షణం. ప్రతిదీ ఒక పద్ధతి ప్రకారం జరగాలంటుంది. ఏది పద్ధతికి భిన్నంగా జరిగినా ఆవిడ తట్టుకోలేదు. అగ్రహోదగ్రయై పోతుంది. పిల్లలపై విరుచుకుపడి హడలగొడ్తుంటుంది. తను వేరు క్రమశిక్షణ వేరు అని ఆవిడ భావించదు.

ఇక భర్త విషయానికి వస్తే, రాజారావు అనసూయ క్రమశిక్షణ జోలికి పోడు. రాజారావు నాటకాల జోలికి అనసూయ పోదు. పోతే యుద్ధమే. పెళ్లైననాటి నుండి పిల్లలు పుట్టేవరకు యుద్ధం చేసిన అనసూయ అలసిపోయి ఇక యుద్ధం చేయటం వలన మిగిలేది కంఠశోష అని తెల్సుకొని ఆ విషయం వదిలేసింది.

ఇలాంటి వాతావరణంలో పుట్టిపెరిగిన సుబ్బారావు పేరుకి తగినట్లుగా తయారయ్యాడు. తల్లి కఠిన నియమాలతో, తిట్లతో పెరిగి ఆవిడ ఏం తిట్టిందో ఆ తిట్లకు ప్రతిరూపం అయ్యాడు.

సుబ్బారావు బ్రతుకొక అయోమయం. ఇంట్లో ఉన్నంతసేపు తల్లి

## ఎ. ఉదయభాస్కరరావు

నోటికి భయం భయంగా గడపటం, ఇంట్లోంచి బయటకు పోయినా ఆ ప్రభావం నుండి బయట పడలేక బెదురు బెదురుగా తిరగటం.

ఇప్పుడు సుబ్బారావు డిగ్రీ ఆఖరి సంవత్సరంలోకి వచ్చినా, చిన్నప్పటి నుండీ అదే ఊరిలో ఉంటున్నా ఈనాటికీ అతనికి ఒక్క స్నేహితుడన్నవాడు లేడు. అతనికి స్నేహం ఎలా ఉంటుందో, ఒకరితో ఒకరు జట్టు ఎలా కడతారో అంతుచిక్కని ప్రశ్నలు.

తను పుట్టకముందే శని పుట్టేసి, ఎక్కడికి వెళ్లినా అది ముందు ఉండి తన బ్రతుకుని విషాదం చేసేస్తోందని అనుకుంటాడు సుబ్బారావు.

'దేభ్యం మొఖం, వాడికి మగవాళ్లని చూస్తే భయం, ఆడవాళ్లని చూస్తే సిగ్గు' అన్న తల్లి తిట్లు అక్షరాలా ఆశీర్వచనమై సుబ్బారావు జీవితాన్ని దానికి తగ్గట్లుగా తయారుచేసినాయి.

సిగ్గు, బిడియం అతని బ్రతుకులో తిష్ట వేస్కుని అతన్ని ఎవరితోనూ కలవకుండా ఎవరూ అతనితో కలవకుండా చేశాయి.

చదువులో వెనకబడి ఒక్కో తరగతి రెండుసార్లు చదువుతూ పాతికేళ్లకి డిగ్రీ ఆఖరి సంవత్సరంలోకి వచ్చాడు. ఎలాగోలా ఈ డిగ్రీ పూర్తిచేస్తే ఏదో పని చూస్కుని తన ఒంటరి బ్రతుకుని తను ఈడ్చచ్చు అనుకుంటూ ఉంటాడు.

ఒకరోజు సుబ్బారావు కాలేజ్ నుండి వస్తుంటే దారిలో ఒకగోడ మీద చక్కగా పెద్దగా రాసిన రాతలు అతని ఒంటరి జీవితంలో పెను అలజడి రేపాయి.

'మానసిక సమస్యలా? సిగ్గు, బిడియంతో నలుగురిలో కలవలేక పోతున్నారా? మీరు అందరితో కలిసిమెలిసి ఉండేలా కావాలనుకుంటున్నారా? అయితే రండి' అన్న అక్షరాలు అమృతపు చినుకుల్లా అతని హృదయం మీద పడ్డాయి.

అసలు ఇటువంటి సమస్య తన ఒక్కడికే వుందని, ప్రపంచంలో తనొక్కడూ వేరని అనుకున్న సుబ్బారావును, ఆ సమస్య కళ్ల ఎదురుగా పెద్ద పెద్ద అక్షరాలతో సాక్షాత్కరించడం, ఆ సమస్యను తొలగించి మామూలుగా చేస్తామనే ఆహ్వానం ఉక్కిరిబిక్కిరి చేశాయి.

తన జీవితంలో ఈ సిగ్గు, బిడియం తనని వదిలిపెట్టవని, తన బ్రతుకింతేనని సుబ్బారావు అనుకునేవాడు. అటువంటిది ఏకంగా వాటిని వదిలించి మామూలుగా అందరిలా ఉండేట్లు చేయడం మరీ అద్భుతంగా అనిపించింది.

తనదీ ఒక బ్రతుకా? మనిషై పుట్టి సాటి మనిషిని చూసి భయపడుతూ పక్కకి తొలిగి పారిపోవటం. జంతువులు, పక్షులు సైతం స్నేహంతో ప్రేమతో జీవితాన్ని ఆనందిస్తుంటే అవేమీ లేకుండా ఎడారి జీవితం ఈడ్వడం... ఈరోజు ఆ సమస్యకు పరిష్కారం దొరికింది. ఆలోచిస్తుంటేనే సుబ్బారావుకి ఒళ్లంతా రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. ఆనందంతో హృదయం పురివిప్పి నాట్యం చేస్తోంది.

గబగబా ఇంటికొచ్చాడు. ఆ ప్రకటన హడావిడిలో సరాసరి ఇంట్లోకి వెళ్లబోయాడు. ఇంతలో అనసూయ, "ఒరేయ్, చవటా. ఆ కాళ్లు కడుక్కుని లోపలికి చావు" అంటూ అరిచింది.

మళ్లీ వెనక్కి వచ్చి నూతి దగ్గరకు పోయి కాళ్లు కడుక్కొని లోపలికి వచ్చాడు. కుర్చీలో కూర్చుని ఆలోచనల్లో పడ్డాడు. 'ఈరోజే వెళ్లి కనుక్కోవాలి, వాయిదాలు ఎందుకు?' అనుకుని లేచి మరలా బయల్దేరాడు.

"ఎక్కడికి పోతున్నావు? రాత్రికి కూరలేం లేవు. ఏమన్నా తెస్తేనే కూర"

అమ్మ ఇచ్చిన డబ్బులు, సంచి తీసుకుని బయటకు నడిచాడు.

ఆ ప్రకటనలోని అడ్రసు ప్రకారం ఓ ఇంటిముందు ఆగాడు. అదే ఇల్లు. గోడమీది ప్రకటన బోర్డు రూపంలో ఇంటి ముందు గోడకు వ్రేలాడుతోంది.

లోపలికి వెళ్లడానికి భయం, ఆందోళన కొత్త మనుషులన్నా కొత్త ప్రదేశమన్నా గుండెల్లో ఒకటే దడ. కాళ్లు ముందుకి పడటం లేదు. ఆ భయం ఆందోళన ఎందుకో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్న సుబ్బారావుకు తెలియదు.

ఎందుకురా భయం? తిడతారా? కొడతారా? చంపుతారా? అంటూ మనసు ప్రశ్నిస్తోంది. అయినా కాళ్లలో చలనం లేదు.

'ఎవరుంటారో! ఏమంటారో! తన సమస్య విని నవ్వుతారేమో! ఇంతకాలం ఎలా బతికావయ్యా అంటూ గేలిచేస్తారేమో! అనవసరంగా ఇదొక కొత్త బాధను తెచ్చుకుంటున్నానేమో?' అంటూ మనసు రకరకాలుగా ఆలోచనలు చేసింది.

చివరికి లోపలికి నెమ్మదిగా అడుగుపెట్టాడు. ఎదురుగా ఓ అతను సుబ్బారావును చూసి వచ్చాడు.

"ఏం కావాలి?"

"అదే బయట బోర్డు వుంది..."

"రండి... ఇలా కూర్చోండి" అతను మరో కుర్చీలో కూర్చున్నాడు.

"చెప్పండి"

"నాకు బాగా సిగ్గండి... నలుగురిలో మాట్లాడలేను. ఎప్పుడూ ఒంటరిగా ఉండాలనిపిస్తుంది..."


"ఓ సై?... ఎవరితోనూ సరిగా మాట్లాడలేరు. ఎవరితోనూ సరైన కాంటాక్ట్ పెట్టుకోలేరు"

"అవునండీ, చాలా చిన్నప్పటి నుండి, నేను పుట్టినప్పటి నుండీ కొత్తవాళ్లంటే భయం... ఎవరితోనూ సరిగా మాట్లాడలేను, భయం..."

"దీన్ని బాగు చెయ్యొచ్చు. అందరిలా మీరూ నలుగురిలో కలిసిపోవచ్చు"

"నిజంగానా?"

"అవును! మా దగ్గర ట్రైనింగ్ తీస్కున్న చాలామంది మారి మామూలుగా ఉంటున్నారు"



"నేనూ వస్తానండి"

"రండి... మీరు నెలరోజులు ట్రైనింగ్ తీస్కుంటారా?"

"అవసరం అయితే తీస్కుంటాను. ఫీజు ఎంతండీ?"

"నెల రోజులకు పదివేలు"

"......."

"పదిహేను రోజులకు ఐదువేలు. వారం రోజులకు రెండువేల ఐదువందలు. ఈ మూడింటిలో ఏది కావాలంటే దానికి రావచ్చు. వారం, పక్షం, నెలా ఏదైనా సరే"

"వారం రోజులైతే పోతుందా?"

"ఊం... వారం వచ్చి మామూలు అయినావాళ్లు ఉన్నారు. మీ పేరు అడ్రసు ఇవ్వండి"

వ్రాసుకున్నాడు. "ఎప్పటినుండి వస్తారు?"

"అదే డబ్బు చూస్కుని వస్తాను"

"ఓకే." అనేసి అతను లోపలికి వెళ్లిపోయాడు.

సుబ్బారావు కుర్చీలోంచి నీరసంగా, బరువుగా లేచి నెమ్మదిగా అడుగులేస్తూ బయటకు వచ్చాడు. 'రెండువేల ఐదువందలు!... వారం రోజులకి!... అంత డబ్బు ఎలా వస్తుంది?' నెల అయితే పదివేలు. అమ్మో! నెలరోజులైతే తను వచ్చే సమస్యే లేదు. అంతడబ్బు ఇన్నేళ్లలో ఒక్కసారో, రెండుసార్లో ఇంట్లో చూసుంటాడు. నాన్న ప్రయివేటు స్కూలు టీచరు. జీతం మూడు నెలలకు ఆరు నెలలకూ వస్తుంటుంది. నాన్న స్కూలు నుండి జీతం కట్టలుగా తేవడం, వాటిని పంపకాలు వేసేసి ఆ మర్నాడు ఇచ్చేయడం జరుగుతుంటుంది. అంత డబ్బు వచ్చిన రెండు రోజులకే పదిరూపాయలు ఇంట్లో ఉండేవి కావు. పాలు, సరుకులు, బియ్యం, బట్టలు, మందులు అన్నీ అప్పే. జీతంరాగానే అవన్నీ తీర్చేయాలి. అంత డబ్బు ఇంట్లో ఆరునెలలకు సరిపోయేది.

ఇప్పుడు అంత డబ్బు ఉంటే తనను నరకబాధ పెడుతున్న ఈ మానసిక సమస్య నుండి బయటపడి అందరిలా మామూలుగా బ్రతకవచ్చు.

దారిలో కూరలు కొని ఇంటికొచ్చి అనసూయకిచ్చాడు.

"బీరకాయలు తెచ్చావు. ముదురువేం కాదు గదా! చూసావా? వాడిచ్చినవి పట్టుకొచ్చావా?"

"చూశాను బావున్నాయి"

తన పుస్తకాలు పెట్టె ముందు కూర్చున్నాడు. పెట్టెలో నుండి పుస్తకాలు బయటకు తీసి క్రింద పెడ్తుంటే తల్లి అరుపులు వినబడ్డాయి. "ఉరేయ్ రెక్కలు ముక్కలయ్యేట్టు ఇప్పుడే ఆ గదంతా కడిగి శుభ్రం చేశాను. మళ్లీ అవన్నీ క్రింద పెడ్తున్నావా?"

"తుడిచేస్తేలేవే"

"ఏమిటి తుడిచేది, ఫో, బయట పెట్టు ఈ దుకాణం"

పెట్టెను బయటకు తెచ్చి అరుగుమీద పెట్టాడు. పెట్టెలో నుండి పుస్తకాలు తీసి ప్రక్కన పెట్టి, పెట్టె అడుగున ఉన్న చిల్లర తీసి లెక్కపెట్టాడు. తొంభై ఆరు రూపాయలు వున్నాయి. అవన్నీ అమ్మ అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బులూ, ఏమైనా కొన్నప్పుడు మిగిలిన చిల్లరా.

'అంటే, ఇంకా రెండువేల నాలుగువందలు కావాలి'. పెట్టె మళ్లీ సర్దేసి లోపలకి తీస్కొచ్చి దానిస్థానంలో పెట్టేశాడు.

కుర్చీలో కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాడు. 'ఎలా వస్తాయి అన్ని డబ్బులు... ఆ డబ్బులుంటేనే తన సమస్యకు పరిష్కారం. సిగ్గుపోయి అందరిలా మామూలుగా బ్రతకటం. ఇంతకాలం అనుభవించిన దుఃఖాన్ని వదిలించుకోవాలంటే ఆ డబ్బులు ఎలాగోలా సంపాదించక తప్పదు. కాని ఎలా?.... అమ్మనో, నాన్ననో అడిగితే... ముందసలు తనకే ఈ విషయం ఎలా చెప్పాలో తెలియదు. ఒకవేళ చెప్పగలిగినా అమ్మ పట్టించుకోదు, పైగా తిడుతుంది. నాన్న అసలు వినవే వినరు.'


నాలుగైదు రోజులు దాని గురించి బుర్ర వేడెక్కేలా ఆలోచించాడు. కాని ఏమీ తట్టడం లేదు. గోడమీద ప్రకటన సుబ్బారావుని నిలబడినియ్యటం లేదు. రాత్రిళ్లు నిద్దర పట్టనివ్వటంలేదు. తను మామూలుగా ప్రవర్తిస్తున్నట్లు, అందరితోనూ నవ్వుతూ కబుర్లు చెప్తున్నట్లు అందరూ తనను అభినందిస్తున్నట్లూ ఒకటే ఊహలు, కలలూ.

ఐదోరోజు, సుబ్బారావుకు మార్గం కనిపించింది. కాని, ప్రమాదకరమైనది. దొంగతనం... అవును, ఇంట్లోనే... అదీ అమ్మగాజులు... అమ్మకి జత బంగారుగాజులున్నాయి. అవి ఏ పెళ్లికో లేదా తాతయ్య వాళ్లింటికి వెళ్లినపుడో పెట్టుకుంటుంది. తనకు తెల్సి ఆ గాజులు అమ్మ చేతులుకి చూసి మూడేళ్లయింది.

ఇప్పట్లో దగ్గర బంధువుల ఇళ్లల్లో ఎవరి పెళ్లీ అయ్యే సూచనలు ఏమీలేవని, పిన్ని పెళ్లి చెయ్యటానికి ఇంకా నాలుగైదేళ్లు పడుతుందని, ఆ పెళ్లే త్వరలో జరిగే పెళ్లి అని అమ్మ నాన్న అనుకుంటుండగా సుబ్బారావు విని వున్నాడు.

కాబట్టి ఆ గాజులు జాగ్రత్తగా తీసి, తాకట్టు పెట్టి రెండువేల ఐదువందలు తీస్కోవాలి. అవి ఫీజుకట్టి తన్నింత కాలం బాధిస్తున్న ఈ సిగ్గును బిడియాన్ని, భయాన్ని వదిలించుకోవాలి.

సిగ్గు, బిడియం పోయాక అమ్మానాన్న ఏమన్నా సమాధానం చెప్పగలడు కదా! అవుడు భయం అసలుండదు కదా!... ఈ యేడాది డిగ్రీ అయిపోతుంది. వచ్చే యేడాది ఏదో ఒక ఉద్యోగంలో చేరి నెలకి రెండువందలు దాస్తే సరి ఆ గాజులు విడిపించి బీరువాలో పెట్టెయ్యొచ్చు. అసలు తీసినట్టే తెలిసే అవకాశం లేదు. తెల్సినా అప్పటివరకూ దాచిన డబ్బు చూపించి తను పడ్డ బాధను చెప్పి అమ్మని ఒప్పించవచ్చు. ఒప్పుకోక పోయి అమ్మ తిట్టినా బాధేం వుంది?... భయం ఎలాగూ వుండదు కదా?... ఇలా సాగాయి సుబ్బారావు ఆలోచనలు. చివరకి గాజులు దొంగతనం చెయ్యాలని తీర్మానించుకున్నాడు.



ఆ అవకాశం మర్నాడే వచ్చింది.

"ఉరేయ్ సుబ్బీ! తమ్ముళ్లు దొడ్లో ఆడుకుంటున్నారు. చూస్తుండు. నేను లక్ష్మిగారింటికి పేరంటానికి వెళ్లొస్తా. ఎక్కడికీ పోకు. నేను వచ్చేవరకూ, వినబడిందా?" అని అమ్మ బయటకు వెళ్లింది.

సుబ్బారావు గబగబా వీధి తలుపు గడియవేసి వచ్చి బీరువా తీశాడు. లోపల చీరల క్రింద పెట్టిన చిన్న పెట్టెలో నుండి రెండు బంగారుగాజులు తీశాడు. మళ్లీ పెట్టె చీరల క్రింద పెట్టేసి చీరలు సర్ది బీరువా మూసేసాడు.

'ఇదివరకొకసారి నాన్న తనూ ఈ గాజులు రెండింటికీ మూడువేలు తెచ్చారు. కాబట్టి ఈసారి రెండువేల ఐదువందలు తేవటం కష్టంకాదు.'

గాజులు రెండూ చిన్న పేపరులో చుట్టి ప్యాంటు జేబులో పెట్టుకుని వీధి తలుపు తీసి చూశాడు. అమ్మ ఇంకా రావటం లేదు.

వచ్చి కుర్చీలో కూర్చుని మళ్లీ ఆలోచనలో పడ్డాడు. 'మార్వాడీ దగ్గరకెళ్లి గాజులు పెట్టి రెండువేల ఐదు వందలు తీస్కుని తిన్నగా వెళ్లి ఫీజు కట్టేసి ఈ రోజు నుండే ట్రైనింగ్‌లో జాయిన్ అయిపోతాడు. వారం... వారం... వారం రోజుల్లో జీవితం మారిపోతుంది. ఈ సిగ్గు, బిడియం మొహమాటం, మనుషుల్ని చూసి పారిపోవటం ఇవన్నీ పటాపంచలైపోతాయి... అందరిలో కలిసి వుంటాడు, కలిసి తిరుగుతాడు, కలిసి ఆడుకుంటాడు. ఆహా... గుండెల నిండా ఎంత హాయి, మనసులో తేనె పోసినట్లు ఎంత తీయగా ఉంది...

"తలుపు బార్లా తీసి కూర్చున్నావేరా? ఏ పిల్లో వచ్చి పాలు కాస్తా తాగిపోతే రాత్రికి మజ్జిగుండదు..." అమ్మ మాట్లాడితే తిట్టినట్లు ఉంటుంది సుబ్బారావుకి.

"అమ్మా! బయటకు వెళ్లొస్తా" అంటూ కంగారుగా వీధిలోకి జారుకున్నాడు.

మార్వాడీ దగ్గర డబ్బు తీస్కొని క్లబ్‌లో కట్టేశాడు. ఆరోజే సుబ్బారావు శిక్షణ కూడా మొదలైంది.

ట్రైనింగ్ ఇవ్వబోయే వ్యక్తి తన పేరు క్రాంతిదేవ్‌గా పరిచయం చేసుకున్నాడు. అతను చెప్పినట్లు ఒక నోటు పుస్తకం సందుచివర కొని తెచ్చుకున్నాడు సుబ్బారావు. ఆ పుస్తకంలో సుబ్బారావు ఎదుర్కొంటున్న సమస్యల్ని రాయమన్నాడు క్రాంతిదేవ్. వరుసగా పది పాయింట్లుగా తనని బాధిస్తున్న సమస్యలను వ్రాసాడు సుబ్బారావు.

"ఇవన్నీ ఇక మిమ్మల్ని వదిలేస్తాయి. మీరు మామూలుగా అయిపోతారు"

తర్వాత లోపలికి తీస్కెళ్లి ఓ గదిలో చాపమీద పడుకోబెట్టాడు. ఆ గదిలో బెడ్‌లైట్ మాత్రం వుంది. కిటికీలన్నీ మూసేసి వున్నాయి. "కళ్లు మూస్కోండి. ఇప్పుడు మీకు వినబడే మాటలు శ్రద్ధగా వినండి. ఇంకేం ఆలోచించవద్దు. ఓకే!"

టేప్‌రికార్డర్ ఆన్ చేసిన శబ్దం. కాసెట్‌లోంచి నెమ్మదిగా మాటలు వినబడుతున్నాయి. అవన్నీ శ్రద్ధగా ఆలకిస్తున్నాడు సుబ్బారావు. సిగ్గు, బిడియం, మొహమాటం, మెతకతనం ఎలా వస్తాయో అవెంత ప్రమాదమో మొదలైన వివరాలు ఉన్నాయి.

ఆ కాసెట్ అయిపోయాక బయటకు వచ్చెయమన్నాడు.

"మరల రేపు ఇదే టైంకి రండి"

మొదటి రోజు మార్పు ఏదైనా వచ్చిందా అని ఆలోచించడం మొదలుపెట్టాడు. కాని వెంటనే 'ఒక్కరోజుకి ఏం వస్తుంది. ఇంకో రెండు రోజులు గడిస్తే వస్తుంది' అని సమాధానపడ్డాడు.

ఆ రెండోరోజు, మూడో రోజూ గడిచాయి. రోజుకి ఒక కాసెట్ వినిపిస్తున్నాడు. అదయ్యాక కూర్చోబెట్టి 'మీకున్న సమస్యలన్నీ వదిలేసి హాయిగా వుండండి, మామూలుగా ఉండండి, అందరితో మాట్లాడండి' అంటూ చెప్తున్నాడు.

నాలుగు, ఐదురోజులు గడిచాక, ఇంకా రెండు రోజులే వున్నది, అనుకున్నాక సుబ్బారావుకి పెద్దగా సంతృప్తి అనిపించలేదు. కాని ఆ విషయం చెప్పలేకపోయాడు. ఆరు, ఏడు రోజులు గడిచి ట్రైనింగ్ పూర్తి అయ్యింది. చివరిరోజున ఏదో పోగొట్టుకున్నవాడిలా అయ్యాడు సుబ్బారావు. వారం ముందు తనెలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే వున్నాడు. ఈవారం రోజుల్లో చాలామందితో మాట్లాడాలని ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. మార్పు రాలేదని, వస్తుందని ఎదురుచూశాడు. కాని ట్రైనింగ్ పూర్తి అయ్యాకా అదే పరిస్థితి వుండటం అతనికి బావురు మనిపించింది. అదే విషయం క్రాంతిదేవ్‌తో చెప్పాడు.

"వారం రోజులూ చాలా విషయాలు మీకు కాసెట్ల ద్వారా, నాద్వారా తెల్సాయి. ఇక మీరు రోజూ వాటిని ప్రాక్టీసు చేస్తూ వుండాలి. మీ ప్రాక్టీసు బావుంటే మీరు అనుకున్న మార్పు త్వరలో వస్తుంది" అనేసి వీలు అయినపుడు కనిపించమని చెప్పాడు క్రాంతిదేవ్.

సుబ్బారావు కాళ్ళీడ్చుకుంటూ బయటకు వచ్చాడు. అతను చెప్పినట్లుగా ప్రయత్నించి చూశాడు. నెలరోజులు గడిచాక, 'పూర్వస్థితిలోనే వున్నా'ననుకొని క్లబ్‌కొచ్చాడు.

"వారం రోజుల శిక్షణ మీకు సరిపోలేదనుకుంటాను. పదిహేను లేదా నెల రోజుల కోర్సులో చేరండి... మీ సమస్య చాలా డీప్‌గా ఉన్నట్లుంది... ఒక్కొక్కసారి వారం సరిపోతుంది... ఆలోచించుకుని చేరండి"

సుబ్బారావుకి ఇదివరకున్న బెంగలకి తోడు ఇపుడు క్రొత్తగా తీవ్రమైన ఆందోళన, ఉద్రిక్తత వచ్చి చేరాయి. ఇంట్లో బీరువా చప్పుడైనా, అమ్మ దేనికైనా అరిచినా గుండెల్లో సూపర్‌ఫాస్ట్ రైళ్లు దడదడా పరుగెడుతున్నాయి. ■

